

నిందితులకు శిక్షపడేలా..
ప్రతి కేసులో నిందితులకు శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని రాచకొండ సీపీ సుధీర్‌బాబు సూచించారు. - 8లో



సమష్టి కృషితోనే అభివృద్ధి
సమష్టి కృషితోనే ఆర్టీసీ అభివృద్ధి పథంలో నడుస్తోందని ఉమ్మడి నల్లగొండ జిల్లా ఆర్‌ఎం రాజశేఖర్ అన్నారు. - 8లో



పీజీ ఫలితాలు విడుదల
ఎంజీయూ పీజీ రెండో సెమిస్టర్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ ఫలితాలను వీసీ అల్తాఫ్ హుస్సేన్ విడుదల చేశారు. - 8లో

జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలి

నల్లగొండ టూటౌన్: జిల్లాకు చెందిన క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకాంక్షించారు. 68వ ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో ఉమ్మడి జిల్లా బాలుర జట్టు ద్వితీయ, బాలికల జట్టు తృతీయ స్థానాల్లో నిలిచిన సందర్భంగా గురువారం నల్లగొండలోని అవుట్ డోర్ స్టేడియంలో విజేత జట్లకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. దీనికి కలెక్టర్ హాజరై క్రీడాకారులను అభినందించి మాట్లాడారు. జిల్లా నుంచి ఐదుగురు క్రీడాకారులు జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపిక కావడం జిల్లాకు ఎంతో గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి విష్ణుమూర్తి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి విమల, హాకీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమామ్ కరీం, వ్యాయామ ఉపాధ్యాయులు వాడపల్లి రవీందర్, గుండా శ్రీనివాస్, కవిత, గఫార్, అలీమ్, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్ త్రిపాఠి, అధికారులు

న్యూస్‌రీల్

నేడు మంత్రి కోమటిరెడ్డి రాక

నల్లగొండ: రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శుక్రవారం నల్లగొండకు రానున్నారు. ఉదయం హైదరాబాద్ నుంచి నల్లగొండ చేరుకుని కలెక్టరేట్‌లో జరిగే జిల్లా అభివృద్ధి సమన్వయ కమిటీ (దిశ) సమీక్ష సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం యాదగిరిగుట్టకు వెళ్లి మిషన్ భగీరథ పైపులైన్ పనులకు శంకుస్థాపన చేస్తారు. తిరిగి సాయంత్రం నల్లగొండకు చేరుకుని ప్రజాపాలన విజయోత్సవాల్లో పాల్గొంటారు.

డాటా ఎంట్రీ పక్కాగా చేపట్టాలి

త్రిపురారం: సమగ్ర కుటుంబ సర్వే వివరాల డాటాను పక్కాగా ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాలని జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి అన్నారు. గురువారం త్రిపురారం మండల కేంద్రంలోని రైతు వేదికలో సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లకు సర్వే వివరాల ఆన్‌లైన్ ఎంట్రీకి సంబంధించి చేపట్టిన శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఆన్‌లైన్ డాటా ఎంట్రీ ప్రక్రియలో నిర్లక్ష్యం చేయొద్దన్నారు. కార్యక్రమంలో త్రిపురారం ఎంపీడీఓ విజయకుమారి, ఏఎస్‌ఓ దీప, పీఆర్‌ఏఈ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశాం



ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, డీఎస్‌ఓ

నల్లగొండ టౌన్: డీసీఎంఎస్ కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు రైతుల నుంచి లక్ష ఐదే వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామని డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం డీఎస్‌ఓ వెంకటేశ్వర్లుతో కలిసి నల్లగొండ పట్టణ పరిధిలోని ఎస్‌ఎల్‌బీసీలోని డీసీఎంఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా చైర్మన్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల ఖాతాల్లో రూ.200 కోట్లు జమచేసినట్లు తెలిపారు. వారివెంట డీసీఎంఎస్ మేనేజర్ నాగిళ్ల మురళి తదితరులు ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు సద్వినియెగం చేసుకోవాలి

త్రిపురారం : గిరిజనుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు సద్వినియెగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని జిల్లా ట్రైబల్ ఇన్‌చార్జ్, హౌసింగ్ పీడీరాజ్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని మాటూర్ పరిధిలోని తండాల్లో గిరిజన సాధికారత వికసిత భారత్ కార్యక్రమంలో భాగంగా దిర్త ఆబ కార్యక్రమంపై గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పీడీ రాజ్ కుమార్ మాట్లాడుతూ జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ పథకాన్ని అర్హులైన వారు సద్వినియెగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో త్రిపురారం ఎంపీఓ సుధీర్ కుమార్, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

ఆరు నెలలు ఆగాల్సిందే!

ఉగాది నుంచే సన్న బియ్యం
- 13,92,006 మంది రేషన్ కార్డుదారుల ఎదురుచూపు
- జనవరి నుంచి పంపిణీ చేస్తామని గతంలో ప్రకటించిన ప్రభుత్వం
- ఇప్పటికీ మార్గదర్శకాలు ఏమీ లేవంటున్న అధికారులు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పొందేందుకు మరో ఆరు నెలలు ఆగాల్సిందే. జనవరిలో సన్న బియ్యం పంపిణీ చేస్తామని ప్రభుత్వం గతంలో ప్రకటించినా ఆచరణ సాధ్యమయ్యేలా లేదు. ప్రస్తుతం వస్తున్న సన్న ధాన్యం బియ్యంగా చేసినా వాటిని వెంటనే వండితే అన్నం ముద్దగా అవుతుందని, అందుకే ఉగాది నాటికి సన్న బియ్యం పంపిణీ పూర్తి స్థాయిలో చేపడతామని ఇటీవల పౌర సరఫరాల శాఖ కమిషనర్ చౌహాన్ ప్రకటించారు. దీంతో జనవరిలో సన్న బియ్యం వస్తాయని ఆశించిన ప్రజలకు నిరాశ తప్పేలా లేదు. పైగా వాటి విషయంలో ఇప్పటివరకు జిల్లాల అధికారులు ఎలాంటి ఉత్తర్వులు కూడా రాకపోవడంతో ఉగాది వరకు వేచి ఉండాల్సి రావచ్చని అధికారులు కూడా పేర్కొంటున్నారు.

భగ్గుమంటున్న సన్న బియ్యం ధరలు
ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో సన్న బియ్యం ధరలు భగ్గుమంటున్నాయి. కిలోకు రూ.50 నుంచి రూ.60 వెచ్చించాల్సి వస్తోంది. వాటి సరఫరా తక్కువగా, వినియోగం ఎక్కువగా ఉండటంతో ధరలు పెరిగిపోయాయి. మరోవైపు ప్రభుత్వం పంపిణీ చేసే దొడ్డు బియ్యాన్ని చాలా కుటుంబాలు తినకుండా అమ్ముకుంటున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం జనవరి నుంచి రేషన్ కింద సన్న బియ్యం ఇస్తామని ప్రకటించింది. అయితే ఇప్పుడు వచ్చిన ధాన్యం మరాడించి పంపిణీ చేస్తే ఆ బియ్యం వండితే ముద్ద అవుతుందని, ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందని, మూడు నాలుగు నెలలు మాగితే బాగుంటాయని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. అందుకే ఉగాది నుంచి పంపిణీ చేసేలా కసరత్తు చేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

లబ్ధిదారులకు తప్పని నిరాశ
జిల్లాలో రేషన్ కార్డులు 13,92,006 మందికి నిరాశ తప్పడం లేదు. ఇన్నాళ్లు దొడ్డు బియ్యం (సాధారణ రకం) తీసుకున్న ప్రజలకు ఇక సన్న బియ్యం వస్తాయని, వాటిని ఎంచక్కా తినొచ్చని భావించినా ఇప్పట్లో ఆ ఆశ నెరవేరేలా లేదు. ప్రస్తుతం జిల్లాలో మొత్తంగా 997 రేషన్ షాపులు ఉండగా, 4,66,012 కార్డులు ఉన్నాయి. వాటి కింద 13,92,006 యూనిట్లు (కార్డులో పేరు నమోదైన ఒక్కో వ్యక్తిని ఒక్కో యూనిట్) ఉన్నాయి. ఇందులో మూడు రకాల కార్డులు ఉన్నాయి. ఆహార భద్రతా కార్డులు 4,35,699 ఉండగా, ఆ కార్డుల్లో పేర్లు నమోదైన ఒక్కో వ్యక్తికి 6 కిలోల చొప్పున 13,08,919 మందికి ప్రభుత్వం ఉచితంగా బియ్యం ఇస్తోంది. ఇక 30,250 అంత్యోదయ కార్డుల కింద 83,023 యూనిట్లు ఉన్నాయి. ఒక్కో కార్డు కింద 35 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేస్తోంది. అన్నపూర్ణ కార్డులు 63 ఉండగా యూనిట్లు 64 ఉన్నాయి. ఇందులో ఒక్కోకార్డు కింద 10 కిలోల చొప్పున బియ్యం ఇస్తోంది. వారంతా సన్న బియ్యం కోసం ఉగాది వరకు వేచి చూడక తప్పని పరిస్థితి.

ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాలేదు

సన్న బియ్యం పంపిణీకి సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలూ రాలేదు. జనవరి నుంచి సన్న బియ్యం పంపిణీ చేయాలా? వద్దా? అన్న దానిపై స్పష్టత లేదు. ఉగాది నుంచి సన్నం పూర్తి స్థాయిలో ఇస్తామని పౌర సరఫరాల శాఖ కమిషనర్ చౌహాన్ పేర్కొన్న నేపథ్యంలో అప్పటివరకు ఆగాలా? లేదా డిసెంబరులో ఏదైనా నిర్ణయం తీసుకుంటారా? అన్నది తేలాల్సి ఉంది.
– జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేశ్వర్లు

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి
- హాలియాలో మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం



మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ త్రిపాఠి, ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి

హాలియా: మహిళలు స్వయం ఉపాధి రంగాల్లో స్థిరపడి ఆర్థికాభివృద్ధి సాధించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం హాలియా పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇందిర మహిళా శక్తి క్యాంటీన్‌ను సాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్వయం సహాయక మహిళా సంఘాలకు ఇందిరా మహిళల శక్తి కార్యక్రమంలో భాగంగా క్యాంటీన్లు, సోలార్ పవర్ జనరేషన్, ఉచిత బస్సు, మొబైల్ షిప్ అవుట్ లెట్లు, మిల్క్ పార్లర్లు ఏర్పాటు చేస్తోందన్నారు. మహిళా సంఘాల సభ్యులు ఎవరైనా సహజ మరణం పొందితే రూ.2లక్షల జీవిత బీమా, ప్రమాదంలో మరణిస్తే రూ.10లక్షలు, అంగ వైకల్యం కలిగితే రూ. 5లక్షల బీమా సౌకర్యాన్ని కల్పిస్తోందన్నారు. సాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోనే మొదటిసారిగా హాలియా మున్సిపాలిటీలో స్వయం సహాయక మహిళా సంఘాలకు మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటు చేయడం సంతోషించదగిన విషయమన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ యడవెల్లి అనుపమనరేందర్ రెడ్డి, గృహ నిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, హాలియా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి, కౌన్సిలర్లు గౌనీ సుధారాణి రాజా రమేష్ యాదవ్, వెంకట్‌రెడ్డి, వెంకటయ్య, ప్రసాద్ నాయక్, నాయకులు కాకునూరి నారాయణ గౌడ్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గౌనీ రాజా రమేష్ యాదవ్, వెంపటి శ్రీనివాస్, కుందూరు రాజేందర్‌రెడ్డి, ఏపీఎం కళావతి తదితరులు పాల్గొన్నారు.

పశువులకు సకాలంలో చికిత్స అందించాలి

- పశు సంవర్థక శాఖ అడిషనల్ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి



నిడమనూరులో దూడలకు నట్టల నివారణ మందు తాగిస్తున్న పశు వైద్యబృందం

త్రిపురారం: రైతులు.. తమ పశువులకు సకాలంలో చికిత్స చేయించుకోవాలని లేకపోతే ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుందని రాష్ట్ర పశు సంవర్థక శాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం నిడమనూరు మండల కేంద్రంలో పశు సంవర్థక శాఖ అద్వర్యంలో నిర్వహించిన ఉచిత పశు గర్భకోశ వ్యాధి నివారణ చికిత్స కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎదకు రాని 60 గేదెలు, ఆవులకు కృత్రిమ గర్భకోశ విధంగా చికిత్స అందించారు. 50 దూడలకు నట్టల మందులు తాగించారు. అనంతరం పశువులకు అవసరమైన ఉచిత మందులను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో రాజశేఖర్, డాక్టర్ సుధాకర్, డాక్టర్ మహిపాల్‌రెడ్డి, గోపాల మిత్రలు బాలరాజు, భిక్షం, నాగయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

26న నిరసనలు



మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

నల్లగొండ టౌన్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 26న జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు అంబటి సోమన్న తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో ఎండీ.మోహినొద్దిన్, దండెంపల్లి సత్తయ్య, నర్సింహారెడ్డి, పెంజర్ల సైదులు, నరేష్‌రెడ్డి, సహదేవులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో మౌలిక వసతుల కల్పనకు కృషి

- ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



డయాలసిస్ మిషన్ పనితీరును పరిశీస్తున్న ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ అర్బన్ : మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం మిర్యాలగూడ పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో అదనంగా ఐదు డయాలసిస్ మిషన్లు అందుబాటులోకి తీసుకురావడంతో వాటిని వారు ప్రారంభించి మాట్లాడారు. ముఖ్యమంత్రితో మాట్లాడి మిర్యాలగూడలో మెడికల కళాశాల ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. అదేవిధంగా మిర్యాలగూడ ఎక్కువగా ఇండస్ట్రియల్ ప్రాంతం కాబట్టి స్థానికంగా ఈఎస్‌ఐ ఆస్పత్రి ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని, వైద్యులు కూడా రోగులకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. డయాలసిస్ రోగులకు ఇబ్బందులు కలుగకుండా ఇప్పటికే ఆస్పత్రిలో ఉన్న ఐదు డయాలసిస్ సెంటర్లకు అదనంగా మరో ఐదు మిషన్లు వైద్యారోగ్య శాఖమంత్రితో మాట్లాడి మంజూరు చేయించామని, డయాలసిస్ రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి మాతృనాయక్, ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస సమరధ్, డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, పట్టణ నాయకులు నూకల వేణుగోపాల్‌రెడ్డి, గాయం ఉపేందర్‌రెడ్డి, స్కైలాబ్‌నాయక్, ముదిరెడ్డి నర్సిరెడ్డి పాల్గొన్నారు.

వరికొయ్యలను కాల్చొద్దు

- డీఏఓ శ్రవణ్‌కుమార్

చిట్యాల: రైతులు.. తమ పొలాల్లోని వరికొయ్యలను కాల్చవద్దని, అలా చేయడం ద్వారా భూమి సారవంతానికి మేలు చేసే మిత్ర పురుగులు, వానపాములు చనిపోతాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి (డీఏఓ) శ్రవణ్‌కుమార్ అన్నారు. చిట్యాల మండలం సుంకేనపల్లి గ్రామంలో గంగాపురం ఊషయ్యకు చెందిన కోత కోసిన వరిపొలాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అంతకుముందు గుండ్రాంపల్లి గ్రామంలోని పీఏసీఎస్‌లో నిల్వ ఉన్న ఎరువులు, ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. సీఈఓకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట పలువురు రైతులు తదితరులు ఉన్నారు.



వరికొయ్యలను పరిశీలిస్తున్న డీఏఓ శ్రవణ్‌కుమార్ తదితరులు

విభేదాలు మరోసారి బహిర్గతం



మున్సిపల్ కార్యాలయం ఎదుట ప్లకార్డులతో కాంగ్రెస్ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు

- మిర్యాలగూడ కాంగ్రెస్ నాయకుల్లో ఆధిపత్యపోరు తారాస్థాయికి..
- మున్సిపల్ కౌన్సిల్‌లో చైర్మన్‌కు వ్యతిరేకంగా కౌన్సిలర్ల ప్లకార్డుల ప్రదర్శన
- కోరం లేక సమావేశం వాయిదా

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు తారాస్థాయికి చేరింది. ఇప్పటికే ఎమ్మెల్యే వర్సెస్ మున్సిపల్ చైర్మన్‌ల మధ్య ఆధిపత్యపోరు కొనసాగుతుండగా తాజాగా మరోసారి విభేదాలు బహిర్గతమయ్యాయి. గురువారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్మన్ తిరునగరు భార్గవ్ అధ్యక్షతన జరగాల్సి ఉంది. అయితే బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరిన కౌన్సిలర్లతో పాటు ఒక బీజేపీ కౌన్సిలర్ మాత్రమే హాజరయ్యారు. దీంతో కోరం లేకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేశారు. అయితే కాంగ్రెస్‌కి చెందిన మరికొందరు కౌన్సిలర్లు స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి చైర్మన్‌కు వ్యతిరేకంగా దొంగనే.. దొంగా దొంగా.. అంటున్నారు ఇదేం పురపాలన అంటూ ప్లకార్డులతో ప్రదర్శనగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. తాము సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. కానీ అప్పటికే సమావేశం కోరం లేక వాయిదా పడడం గమనార్హం.

ఎమ్మెల్యేను బద్నాం చేస్తున్నారు..
ఈ సందర్భంగా కాంగ్రెస్ కౌన్సిలర్లు మాట్లాడుతూ మున్సిపల్ చైర్మన్ భార్గవ్ ఆయన భార్యతోపాటు ఆయన అనుచరుడు మొత్తం 15 ఏళ్ల పాటు మున్సిపల్ ఖజానాను దోచుకున్నారని ఆరోపించారు. చైర్మనే అక్రమంగా భవనాలు నిర్మించి.. తన హయాంలో సక్రమ, అక్రమ కట్టడాల వివరాలు తెలపాలని ఈనెల 8న ఆర్‌టీఐ పేరుతో కమిషనర్, టీపీఓలకు లేఖ రాయడం హాస్యాస్పందంగా ఉందని ధ్వజమెత్తారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి వెళ్లి అక్రమాలకు పాల్పడుతూ.. ఎమ్మెల్యేను బద్నాం చేస్తున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు చెప్పుకుంటున్న చైర్మన్ ఒక్క రోజు కూడా కాంగ్రెస్ పార్టీ కండువాను కప్పుకోలేదని విమర్శించారు. భార్గవ్‌ను తాము కాంగ్రెస్ పార్టీ నేతగా గుర్తించడం లేదని తేల్చి చెప్పారు. ప్లకార్డుల ప్రదర్శనలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి చిలుకూరి బాలు, పొదిల శ్రీనివాస్, కాంగ్రెస్ కౌన్సిలర్లు బండి యాదగిరిరెడ్డి, రుణాల్‌రెడ్డి, దేశిడి శేఖర్‌రెడ్డి, ముదిరెడ్డి నర్సిరెడ్డి, కొమ్ము శ్రీనివాస్, వంగాల నిరంజన్ రెడ్డి, జయలక్ష్మి, అనిత, నాగలక్ష్మి, రామకృష్ణలతో పాటు పలువురు కౌన్సిలర్లు, పార్టీ వివిధ వార్డుల ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

విధులు సమర్థంగా నిర్వహించాలి



కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు, నల్లగొండ, సూర్యాపేట ఎస్పీలు



కవాతు చేస్తున్న కానిస్టేబుళ్లు



కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్‌ను చూసేందుకు వచ్చిన కుటుంబ సభ్యులు

- పోలీస్ ఉద్యోగం అంటేనే అనేక సవాళ్లను అధిగమించాలి
- కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్‌లో రాచకొండ సీపీ సుధీర్‌బాబు
- వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన కుటుంబ సభ్యులు

నల్లగొండ క్రైం: కొత్తగా విధుల్లో చేరబోయే పోలీసులు సమర్థంగా విధులు నిర్వహిస్తూ పోలీస్ శాఖకు వన్నె తేవాలని రాచకొండ కమిషనర్ ఆఫ్ పోలీస్ (సీపీ) సుధీర్‌బాబు అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని తొమ్మిది నెలలుగా శిక్షణ పొందిన కానిస్టేబుళ్లకు గురువారం పాసింగ్ అవుట్ పరేడ్ నిర్వహించారు. శిక్షణార్థుల నుంచి నల్లగొండ, సూర్యాపేట జిల్లాల ఎస్పీలు శరత్‌చంద్ర పవార్, సన్‌ప్రీత్ సింగ్‌తో కలిసి సీపీ గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగమంటేనే అనేక సవాళ్లను అధిగమించాల్సి ఉంటుందన్నారు. శిక్షణలో నేర్చుకున్న అన్ని అంశాలు విధి నిర్వహణలో ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నేరాల నియంత్రణలో నిత్య విద్యార్థిగా మారాలన్నారు. సైబర్ నేరాలు, ఇతర నేర సంఘటనలను వెలికి తీయడంలో సాంకేతిక నైపుణ్యాలు వినియోగించుకోవాలన్నారు. నూతనోత్సాహంతో ప్రజలకు ప్రాణ వాయువులా సేవలందించాలన్నా రు. విధుల్లో ఒత్తిడికి గురికాకుండా శారీరక, మానసింగా ధృడత్వం కోసం రోజూ వ్యాయామం, యోగా సాధన చేయాలన్నారు. విధి నిర్వహణలో ఉన్నతాధికారుల సూచనలు తప్పకుండా పాటించాలన్నారు. అవసరమైతే ప్రాణ త్యాగానికి సిద్ధపడేది పోలీసులే అన్నారు. శిక్షణ కాలంలో ఉత్తమ ప్రతిభకనబర్చిన బెస్ట్ ఆల్‌రౌండర్ జె.అనిల్, బెస్ట్ ఇండోర్ ఆర్.మహేష్, బెస్ట్ అవుట్‌డోర్ ముజీబుద్దీన్, బెస్ట్ ఫైర్ టి.ప్రశాంత్, పరేడ్ కమాండర్ నరేష్‌లకు అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీటీసీ ఏఎస్పీ రమేష్, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ రాములునాయక్, డీఎస్పీ విఠల్‌రెడ్డి, శివరాంరెడ్డి, శ్రీనివాస్, సీఐలు డానియెల్, రాజశేఖర్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల్లో వెల్లివిరిసిన ఆనందం

నల్లగొండ డీటీసీలో సంగారెడ్డి, వికారాబాద్, కామారెడ్డి, నారాయణపేట, నిర్మల్ జిల్లాలకు చెందిన పోలీస్ అభ్యర్థులు తొమ్మిది నెలలుగా శిక్షణ పొందారు. కాగా నల్లగొండ జిల్లాకు చెందిన పోలీసులు మేడ్చల్‌లో శిక్షణ పొందారు. తమ పిల్లలు పోలీస్ ఉద్యోగ శిక్షణ పూర్తి చేసుకుని విధుల్లో చేరనుండడంతో ఆయా జిల్లాల నుంచి వచ్చిన కుటుంబ సభ్యుల్లో ఆనందం వెల్లివిరిసింది. మొత్తంగా పోలీస్ ఉద్యోగం సాధించిన తమ కుమారులు, కుమార్తెలను చూసిన వారి కుటుంబ సభ్యులు, బంధువులు బావోద్వేగానికి గురయ్యారు. ఆత్మీయంగా అలింగనం చేసుకోవడంతో పాటు ఉద్యోగం పొందిన వారు వారి తల్లిదండ్రులకు పాదాభివందనం కృతజ్ఞతలు తెలిపారు. కొందరు శిక్షణార్థులు తమ తల్లిదండ్రుల నెత్తిపై పోలీస్ టోపీలు పెట్టి, చేతికి గన్నులు ఇచ్చి మురిసిపోయారు.

క్లుప్తంగా

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

● మరొకరికి గాయాలు

మర్రిగూడ: బైక్‌పై వెళ్తున్న వ్యక్తి అదుపుతప్పి చెట్ల పొదల్లో దూసుకెళ్లడంతో తీవ్ర గాయాల పాలై మృతిచెందాడు. ఈ ఘటన మర్రిగూడ మండలం తిరగండ్లపల్లి గ్రామ శివారులో బుధవారం రాత్రి జరిగింది. గురువారం ఎస్‌ఐ మునగాల కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం సుద్దపల్లి గ్రామానికి చెందిన గ్యార నరసింహ(27), ఏర్పుల శివ బుధవారం రాత్రి బైక్‌పై హైదరాబాద్ నుంచి మర్రిగూడ మండలం తిరగండ్లపల్లి గ్రామంలోని తమ బంధువుల ఇంటికి వెళ్తుండగా.. మార్గమధ్యలో మాల్, తిరగండ్లపల్లి గ్రామాల మధ్యన ఇప్పబండ మూలమలుపు వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి సమీపంలోని చెట్లపొదల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో బైక్ వెనుక కూర్చున్న గ్యార నరసింహ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందగా.. బైక్ నడుపుతున్న ఏర్పుల శివకు గాయాలయ్యాయి. నరసింహ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు. గురువారం మృతుడి తండ్రి గ్యార అంజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ముక్తాపూర్‌లో బోరు మోటార్లు చోరీ



చోరీకి గురైన బోరు మోటార్లు

భూదాన్‌పోచంపల్లి: పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్‌లో గుర్తుతెలియని వ్యక్తులు రైతుల వ్యవసాయ బావుల వద్ద బోరు మోటార్లను ఎత్తుకెళ్లారు. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. ముక్తాపూర్ గ్రామానికి చెందిన పలువురు రైతులు రైస్ మిల్లు నుంచి రేవనపల్లికి వెళ్లే మూసీలో బోరు మోటార్లు ఏర్పాటు చేసుకొని వ్యవసాయం చేస్తున్నారు. గురువారం ఉదయం మోటార్లు పెట్టడానికి వెళ్లగా.. ఇడమోని అంజయ్యకు చెందిన రెండు మోటార్లతో పాటు ఏనుగు అలివేలు, మునుకుంట్ల బాలరత్నం, ఇడమోని లింగస్వామి, బండారు యాదిరెడ్డి, పబ్బ కైలాసం చెందిన మోటార్లతో పాటు కరెంట్ వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు గుర్తించారు. చోరీకి గురైన బోరు మోటార్లు, కరెంట్ వైర్ల విలువ సుమారు రూ.2.20లక్షల వరకు ఉంటుందని రైతులు పేర్కొన్నారు. మండలంలో పలు గ్రామాల్లో పదుల కొద్దీ బోరు మోటార్లను ఎత్తుకెళ్తుండడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పోలీసులు రాత్రివేళ పెట్రోలింగ్ పెంచాలని కోరుతున్నారు.

సెంట్రల్ డ్రగ్స్ స్టోర్ తనిఖీ



సెంట్రల్ డ్రగ్స్ స్టోర్‌ను తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం

నల్లగొండ టౌన్: రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ టాస్క్‌ఫోర్స్ బృందం గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని సెంట్రల్ డ్రగ్స్ స్టోర్‌ను తనిఖీ చేశారు. జిల్లాలోని ఆస్పత్రులకు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు డ్రగ్స్ స్టోర్స్ ద్వారా అందజేస్తున్న మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కాలం చెల్లిన మందుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో టీబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎ. రాజేశం, డీఎంహెచ్‌ఓ డాక్టర్ పుట శ్రీనివాస్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సంతోష్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ స్వాతి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, డీటీసీఓ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, ఫార్మసీ సూపర్‌వైజర్ వీరారెడ్డి పాల్గొన్నారు.

● కల సాకారమైన వేళ



మీ కష్టానికి ప్రతిఫలం నాన్నా : నల్లగొండలోని పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుల్ తుపాకీని చూపెట్టగా ఆనందపరవశులవుతున్న తండ్రి, కుటుంబ సభ్యులు



ఈ 'గౌరవం' నీదే అమ్మా : కానిస్టేబుళ్ల పాసింగ్ ఔట్ పరేడ్ సందర్భంగా తన తల్లికి గౌరవ వందనం చేస్తున్న ఓ కానిస్టేబుల్



అమ్మతో ఆనంద క్షణాలు : తల్లికి టోపీ, తుపాకీ అందజేసి ఫొటో దిగుతున్న కానిస్టేబుల్



మీ నాన్న పోలీస్ : ట్రైనింగ్ పూర్తిచేసుకుని బిడ్డను ఆనందంతో ఎత్తుకున్న కానిస్టేబుల్



కలకాలం గుర్తుండిపోవాలి : పాసింగ్ ఔట్ పరేడ్ అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి సెల్ఫీ దిగుతున్న కానిస్టేబుళ్లు

నిందితులకు శిక్షపడేలా చర్యలు తీసుకోవాలి

● రాచకొండ సీపీ సుధీర్ బాబు

యాదగిరిగుట్ట రూరల్: నమోదైన ప్రతీ కేసులో నిందితులకు శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని రాచకొండ సీపీ సుధీర్‌బాబు అన్నారు. యాదగిరిగుట్ట మండలం సైదాపురం గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 329లో గల 30 ఎకరాల స్థలాన్ని పోలీస్ హెడ్‌క్వార్టర్స్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కేటాయించగా.. ఆ స్థలాన్ని గురువారం సీపీ పరిశీలించి మాట్లాడారు. భువనగిరిలో తాత్కాలిక భవనంలో కొనసాగుతున్న ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్‌క్వార్టర్స్‌ను ఈ స్థలంలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా పోలీస్ శాఖకు సంబంధించి శిక్షణ కేంద్రాన్ని కూడా త్వరలో ప్రారంభించాలని అన్నారు. కేసులను సత్వరమే విచారణ చేసి చార్జిషీట్ వేయాలన్నారు. నాన్ బెయిలబుల్ వారంటీలు అన్నీ అమలు చేయాలని ఆదేశించారు. ప్రస్తుత టెక్నాలజీ వాడుకుని నిందితులను పట్టుకోవాలని సూచించారు. ఆపదలో ఉన్న ప్రజలకు సత్వరమే స్పందించి తగిన న్యాయం చేయాలని తెలియజేశారు. అనంతరం భువనగిరి జోన్‌లోని కేసులకు సంబంధించి సమీక్ష నిర్వహించారు. ఆయన వెంట భువనగిరి డీసీపీ రాజేష్ చంద్ర, యాదాద్రి ఏసీపీ రమేష్, యాదగిరిగుట్ట పట్టణ సీఐ రమేష్, యాదగిరిగుట్ట రూరల్ సీఐ కొండల్ రావు, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది ఉన్నారు.



యాదగిరిగుట్ట రూరల్: పోలీస్ హెడ్‌క్వార్టర్స్ ఏర్పాటుపై చర్చిస్తున్న సీపీ సుధీర్‌బాబు

యాదగిరీశుడి సన్నిధిలో సీపీ పూజలు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని రాచకొండ సీపీ సుధీర్‌బాబు, భువనగిరి డీసీపీ రాజేష్ చంద్ర గురువారం దర్శించుకున్నారు. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్టా అలంకార మూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ముఖ మండపంలోని సువర్ణ పుష్పార్చన మూర్తుల వద్ద అష్టోత్తర పూజల్లో పాల్గొన్నారు. వారికి అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.



యాదగిరిగుట్ట: సీపీ సుధీర్‌బాబు, డీసీపీ రాజేష్ చంద్రకు ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

● నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ: విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో నిర్వహించిన ర్యాగింగ్ వ్యతిరేక జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇటీవల నల్లగొండ ప్రభుత్వ వైద్య కళాశాలలో జరిగిన ర్యాగింగ్ సంఘటన బాధాకరమని అన్నారు. ఇలాంటివి జరిగితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. భవిష్యత్తులో ఏదైనా విద్యాసంస్థలో విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే విద్యార్థులపై చర్యలతో పాటు విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేస్తామని తెలిపారు. ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థులు ర్యాగింగ్ పాల్పడకుండా అవగాహన కల్పించాలని, కళాశాలల్లో యాంటీ ర్యాగింగ్ కమిటీల సమావేశాలను నిరంతరం నిర్వహించాలని సూచించారు. ప్రతినెల మొదటి శుక్రవారం జిల్లా స్థాయి ర్యాగింగ్ వ్యతిరేక కమిటీ సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలలో సీసీటీవీలను పవర్ బ్యాకప్‌తో పకడ్బందీగా నిర్వహించాలని, ఎన్‌ఎంజీ గైడ్‌లైన్స్‌ను తప్పకుండా పాటించాలన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో జరిగిన ర్యాగింగ్ సంఘటన పట్ల కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, అడిషనల్ ఎస్పీ రాములునాయక్, డీఎస్పీ శివరాంరెడ్డి, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శ్రీవాణి, సురేష్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి

విడాకులు తీసుకోకుండానే మరో పెళ్లి చేసుకున్నాడు

● నల్లగొండ డీఈఓ భిక్షపతిపై మొదటి భార్య ఆరోపణ

● ఆయన ఇంట్లోకి వెళ్లి నిలదీసిన మాధవి

నల్లగొండ: తనకు విడాకులు ఇవ్వకుండానే మరో మహిళతో ఎలా కాపురం చేస్తావని నల్లగొండ జిల్లా విద్యాశాఖాధికారి భిక్షపతిని ఆయన మొదటి భార్య మాధవి ప్రశ్నించారు. ఆమె గురువారం నల్లగొండలోని డీఈఓ భిక్షపతి ఇంటికి వెళ్లి.. విడాకుల కేసు కోర్టులో ఉండగా మరో మహిళలను పెళ్లి చేసుకుని ముగ్గురు పిల్లలను ఎలా కంటావని మాధవి డీఈఓను నిలదీసింది. దాదాపు అరగంట పాటు ఇంట్లో గొడవకు దిగింది. ఈ ఘటన బయటికి పొక్కడంతో మీడియా బృందం డీఈఓ ఇంటికి చేరుకుంది. ఈ సందర్భంగా మాధవి మీడియాతో మాట్లాడుతూ.. 14 సంవత్సరాల క్రితం డీఈఓ భిక్షపతితో తనకు పెళ్లి జరిగిందని, పెళ్లయిన నెల రోజులకే తనపై లేనిపోని ఆరోపణలు చేసి విడాకుల కోసం కోర్టులో విడాకుల కేసు వేశాడని మాధవి తెలిపారు. విడాకుల కేసు కోర్టులో పెండింగ్‌లో ఉందని, కేసు పూర్తి కాకముందే భిక్షపతి మరో మహిళను పెళ్లి చేసుకుని ముగ్గురు పిల్లలను కన్నాడని పేర్కొన్నారు. అయితే, డీఈవోతో గొడవపడుతున్న సమయంలో ప్రస్తుతం డీఈవోతో కలిసి ఉంటున్న భార్య మాత్రం బయటకు రాలేదు. కాగా, పోలీసులు డీఈఓ ఇంటికి చేరుకుని మాధవితో మాట్లాడారు. విభేదాలు ఉంటే కోర్టులో పరిష్కరించుకోవాలని చెప్పి ఆమెను అక్కడి నుంచి పంపించారు. మాధవి స్వస్థలం గోదావరిఖని అని తెలిసింది. ప్రస్తుతం విడాకుల కేసు మిర్యాలగూడ కోర్టులో నడుస్తోంది. ఈ విషయంపై డీఈఓను వివరణ కోరగా.. కేసు కోర్టు పరిధిలో ఉన్నందున తాను ఏమీ మాట్లాడలేనని తెలిపారు.



డీఈఓ భిక్షపతి నివాసంలో ఆందోళన చేస్తున్న మొదటి భార్య మాధవి

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

నల్లగొండ క్రైం : నల్లగొండ జిల్లా విద్యాధికారి భిక్షపతిపై మొదటి భార్య మాధవి గురువారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనను మానసికంగా వేధింపులకు గురిచేసి మరో మహిళతో సంబంధం కొనసాగించడంతో కోర్టులో కేసు వేశానని, కేసు పెండింగ్‌లో ఉందన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నామని నల్లగొండ టూటౌన్ ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి

● భార్యకు తీవ్ర గాయాలు

తిరుమలగిరి: బైక్‌పై శుభకార్యానికి వెళ్తున్న భార్యాభర్తలు రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొనగా.. ఘటనా స్థలంలోనే భర్త మృతిచెందాడు. మృతుడి భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన తిరుమలగిరి మండలం దుబ్బతండా పరిధిలో గురువారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తాటిపాముల గ్రామానికి చెందిన వనం వెంకటేశ్వర్లు(35), అతడి భార్య వాణి కలిసి గురువారం రాత్రి బైక్‌పై తిరుమలగిరి మండల కేంద్రంలో తమ బంధువుల వివాహ రిసెప్షన్‌కి వెళ్తుండగా.. మార్గమధ్యలో సూర్యాపేట-జనగామ ప్రధాన రహదారిపై దుబ్బతండా సమీపంలో రోడ్డుపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతిచెందాడు. అతడి భార్య వాణికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వాణిని తిరుమలగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. మృతుడు వెంకన్న లారీ డ్రైవర్‌గా పనిచేస్తుండగా.. వారికి ఇద్దరు కుమారులున్నారు.



భార్యా పిల్లలతో వెంకటేశ్వర్లు (ఫైల్)

ఆయుధాలతో నలుగురి పట్టివేత?

● నల్లగొండ పోలీసుల అదుపులో అనుమానితులు

సాక్షి, ఆదిలాబాద్: షార్ట్ వెపన్స్ కలిగి ఉన్న నలుగురు వ్యక్తులను తెలంగాణ పోలీసులు ఆదిలాబాద్-మహారాష్ట్ర సరిహద్దులో భోరజ్ చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నట్లు సమాచారం. వారు ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సాధువులు అనే ప్రచారం జరుగుతోంది. నల్లగొండ నుంచి వచ్చిన పోలీసులు ఆదిలాబాద్ జిల్లా పోలీసుల సహకారంతో వారిని అదుపులోకి తీసుకొని నేరుగా హైదరాబాద్‌కు తరలించినట్లు తెలుస్తోంది. ఈ విషయంలో పోలీసులు గోప్యత పాటిస్తున్నారు. మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత ఈ సంఘటన సరిహద్దులో చోటుచేసుకోవడం అనుమానాలకు తావిస్తోంది. ఆ నలుగురు ఎటు నుంచి ఎటువైపు వెళ్తున్నారు.. వారు ఎందుకోసం ఈ మార్గం గుండా బయల్దేరారు.. వారి లక్ష్యం ఏమిటనే విషయాలు తెలియరాలేదు.

ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు ఎంపిక



మారం పవిత్ర

పెన్‌పహాడ్: అస్సాం రాష్ట్రంలోని ఐఐటీ గౌహతిలో ఈ నెల 30వ తేదీ నుంచి డిసెంబర్ 3వ తేదీ వరకు నిర్వహించనున్న 10వ ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు పెన్‌పహాడ్ మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు మారం పవిత్ర ఎంపికయ్యారు. గురువారం ఆమె మాట్లాడుతూ.. మినిస్ట్రీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్స్ ఆఫ్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సైన్స్ ఫెస్టివల్‌లో వివిధ రకాల ఈవెంట్స్‌లో మన దేశంతో పాటు ఇతర దేశస్తులు కూడా పాల్గొంటారని తెలిపారు. ఈ సైన్స్ ఫెస్టివల్‌లో యాస్పైరింగ్ ఎడ్యుకేటర్స్ అండ్ టీచర్స్ వర్క్‌షాప్‌తో పాటు ది గురుకుల ఎక్స్‌పీరియన్షనల్ లెర్నింగ్ ఈవెంట్‌కు రీసోర్స్‌పర్సన్‌గా, సైన్స్ సఫారీ ఈవెంట్‌కి పార్టిస్పెంట్‌గా పాల్గొనేందుకు తనకు ఆహ్వానం లభించి ఆమె పేర్కొన్నారు.

కుటుంబ వివరాలు తెలియజేసిన మండలి చైర్మన్

చిట్యాల: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామంలో రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కుటుంబ వివరాలను చిట్యాల మండల అధికారులు గురువారం సేకరించారు. ఈ సందర్భంగా చిట్యాల తహసీల్దార్ క్రిష్ణనాయక్ ఆధ్వర్యంలో అధికారులు చైర్మన్ కుటుంబానికి చెందిన పూర్తి వివరాలను సేకరించి ఆయనతో సర్వే పత్రాలపై సంతకం తీసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జయలక్ష్మి, ఆర్‌ఐ జానీ షరీఫ్, ఎన్యుమరేటర్ బొప్పని యాదయ్య, గుత్తా యువసేన అధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సర్వే ఫాంపై సంతకం చేస్తున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

'నూరేండ్ల నా ఊరు' పాటకు గాయకుల ఎంపిక

నకిరేకల్: సినీ గేయ రచయిత వరంగల్ శ్రీనివాస్ రచించిన 'నూరేండ్ల నా ఊరు' పాట చిత్రీకరణకు గాను నకిరేకల్ పట్టణంలోని గీతా మందిరంలో గురువారం ఉమ్మడి జిల్లా నుంచి గాయనీ గాయకులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన 150 మంది గాయనీ గాయకులు పాల్గొన్నారు. గేయ రచయిత వరంగల్ శ్రీనివాస్‌తో పాటు గాయకులు వేముల పుష్ప, ఏపూరి సోమన్న, కోదారి శ్రీనివాస్, అంబటి వెంకన్న, రాయి వసంత తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని పాట నేపథ్యాన్ని వివరించారు. రచయిత వరంగల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి గ్రామాల్లో ఉన్న అనేక మంది మట్టిలో మాణిక్యాలను వెలికి తీసి ఈ పాటలో భాగస్వామ్యం చేయాలనే ఉద్దేశంతో నల్లగొండ జిల్లాకు వచ్చి గాయనీ గాయకులను ఎంపిక చేసినట్లు తెలిపారు. స్వయంగా రచయిత వరంగల్ శ్రీనివాసే న్యాయనిర్ణేతగా వ్యవహరించి తనకు కావాల్సిన మంచి గాయనీ గాయకులను ఎంపిక చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మద్దెల సందీప్, జూపాక శివ, గూడురు మహేష, లతీఫ్, పల్స నిర్మల తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గాయని వేముల పుష్ప

సమష్టి కృషితోనే అభివృద్ధి పథంలో ఆర్టీసీ

● రీజినల్ మేనేజర్ రాజశేఖర్ ● ఉత్తమ సిబ్బందికి అవార్డులు

నల్లగొండ రూరల్: సమష్టి కృషితోనే ఆర్టీసీ అభివృద్ధి పథంలో నడుస్తోందని ఉమ్మడి నల్లగొండ జిల్లా రీజినల్ మేనేజర్(ఆర్‌ఎం) రాజశేఖర్ అన్నారు. గురువారం నల్లగొండ బస్టాండ్‌లోని రీజినల్ ట్రైనింగ్ సెంటర్‌లో రీజినల్ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన సిబ్బందికి ప్రగతి చక్ర అవార్డులను ఆయన అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సురక్షిత ప్రయాణానికి ఆర్టీసీ బ్రాండ్‌గా ఉందన్నారు. డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, హెల్పర్ల సమష్టి కృషితో ఆర్టీసీ ఆర్థికంగా బలోపేతమవుతుందన్నారు. ఉత్తమ బస్ స్టేషన్‌గా ఎంపికైన దేవరకొండ బస్ డిపో మేనేజర్ రమేష్‌బాబును, సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎంలు మాధవి, శివశంకర్, నల్లగొండ డిపో మేనేజర్ శ్రీనాథ్, మిర్యాలగూడ డీఎం రాంమోహన్‌రెడ్డి, కోదాడ డీఎం శ్రీహర్ష, సూర్యాపేట డీఎం సురేందర్, యాదగిరిగుట్ట డీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



అవార్డులు అందజేసిన ఆర్‌ఎం రాజశేఖర్

క్యాంపస్ సమాచారం

పీజీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

నల్లగొండ రూరల్: మహాత్మాగాంధీ యూనివర్సిటీ పీజీ రెండో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ ఫలితాలను వైస్ చాన్స్‌లర్ అల్తాఫ్ హుస్సేన్ గురువారం విడుదల చేశారు. పీజీ రెండో సెమిస్టర్‌లో 1143 మంది విద్యార్థులకు గాను 62.9 శాతం ఉత్తీర్ణత సాధించగా.. మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్‌లో 261 మంది విద్యార్థులకు గాను 46.13 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఫలితాలను యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని వీసీ సూచించారు. కార్యక్రమంలో పరీక్షల నియంత్రణ అధికారి ఉపేందర్‌రెడ్డి, రిజిస్ట్రార్ రవి, అడిషనల్ కంట్రోలర్ లక్ష్మీప్రభ, సంధ్యారాణి, కోఆర్డినేటర్లు భిక్షమయ్య, రమేష్, పాల్గొన్నారు.



ఫలితాలు విడుదల చేస్తున్న ఎంజీయూ వైస్ చాన్స్‌లర్ అల్తాఫ్ హుస్సేన్

బ్యాడ్మింటన్ పోటీలకు మహిళా జట్టు ఎంపిక



ఎంపికైన మహిళా జట్టుతో యూనివర్సిటీ అధికారులు

నల్లగొండ రూరల్: కర్ణాటకలోని బెలగాంలో గల విశ్వేశ్వరయ్య టెక్నలాజికల్ యూనివర్సిటీలో జరగనున్న అంతర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనే జట్టును గురువారం మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఎంపిక చేశారు. ఎంజీయూ తరఫున మౌనిక, మానస, కళ్యాణి, హరిప్రియ, వనిత, చైతన్య, సుస్మిత ప్రాతినిధ్యం వహిస్తారని స్పోర్ట్స్ కార్యదర్శి హరీష్, మురళి, ప్రకాష్, నారాయణ, సురేష్ తెలిపారు.

చలికాలం.. జీవాలు జాగ్రత్త

పాడిపంట

నడిగూడెం: రోజురోజుకూ చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో జీవాలకు దొమ్మ, జలుబు వంటి వ్యాధుల ముప్పు పొంచి ఉంది. చలికాలంలో పశువులు వ్యాధుల బారిన పడకుండా పోషకులు, పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని నడిగూడెం మండల పశువైద్యాధికారి డాక్టర్ బి. అఖిల సూచించారు. జీవాలకు చలికాలంలో నిమ్ము, జలుబు, దగ్గు వ్యాధులు వస్తే ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో ఆమె మాటల్లోనే..



1. దొమ్మ రోగం: దొమ్మ రోగం వ్యాప్తికి పలు రకాల బ్యాక్టీరియాలు, వైరస్‌లు, పరాన్న జీవులు కారణం. కంటేజియస్ కాప్రైస్ ప్లూరో నిమోనియా అనే వైరస్ కారణంగా మేకలకు మాత్రమే తరచుగా వచ్చే వ్యాధి ఇది. ఈ వ్యాధి సోకిన జీవాలకు తీవ్రంగా జ్వరం ఉంటుంది.

- వేగంగా శ్వాస పీల్చుకోవడం, ఎగ శ్వాస, ముక్కు నుంచి నీరు, చీమిడి కారడం, ఆకలి లేకపోవడంతో జీవాలు రోజురోజుకూ నీరసించిపోతాయి.
- కళ్లు ఎర్రబడి నీరు కారడం, వీపు భాగం వంగి ఉండటం, తల, మెడ ముందుకు సాగినట్లు కనిపిస్తాయి. అంతేకాకుండా ముక్కు రంధ్రాలు వెడల్పుగా అవుతాయి.
- త్వరగా చికిత్స చేయించకపోతే ఊపిరితిత్తులు వాచి వాటికి చీము పట్టే ప్రమాదముంది. ఈ లక్షణాలు కనిపిస్తే దొమ్మ రోగంగా నిర్ధారణకు రాకూడదు.
- ఈ లక్షణాలు అమ్మతల్లి, పీపీఆర్ మొదలైన జబ్బుల్లో కూడా కనిపిస్తాయి. ఎప్పటికప్పుడూ టీకాలు వేయించాలి. తేలికగా జీర్ణమయ్యే ఆహారం, శుభ్రమైన నీటిని అందించాలి.

2. జలుబు, దగ్గు : జీవాలకు జలుబు సోకినప్పుడు తుమ్ములతో పాటు కళ్లు, ముక్కు నుంచి నీరు కారడం, చీమిడి పుసుపు రంగులోకి మారడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

- పశువుల పాక ఇరుకుగా ఉండడం, గాలి, వెలుతురు సరిగ్గా లేకపోవడం, పాకల్లో తేమ, తడి ఎక్కువగా ఉండటం కాలుష్యం, దుమ్ము వాతావరణంలో అకస్మాత్తుగా వచ్చే మార్పులు ఈ జబ్బుకు కారణమవుతుంటాయి.
- అలాగే క్రిముల ద్వారా సోకే అంటువ్యాధులతో పాటు బయట నుంచి ఆహారం ద్వారా శ్వాసకోశంలోకి వచ్చే కణాలు, నూనె పదార్థాలు, శ్వాస కోశాన్ని చికాకు పెట్టే ఇతర పదార్థాలు జలుబు, దగ్గుకు కారణమవుతాయి.
- దీని నివారణకు పాకలోకి గాలి, వెలుతురు వచ్చేలా చూడాలి. వాతావరణం సరిగా లేనప్పుడు జీవాలను బయటకు వదలకూడదు. పాకను శుభ్రంగా ఉంచాలి. జబ్బు సోకినప్పుడు పశువైద్యాధికారులను సంప్రదించాలి.
- ఒక వేళ జీవి చనిపోతే పోస్టుమార్టం ద్వారా వ్యాధి నిర్ధారణ చేసి, మందలోని మిగిలిన జీవులకు చికిత్స చేయించాలి. ఈ వ్యాధి సోకకుండా ముందు జాగ్రత్తగా టీకా వేయించాలి.

చలికాలంలో జీవాలు నీరసంగా కనిపించినా.. ఏదైనా రోగం బారిన పడినా వెంటనే గుర్తించి పశువైద్యాధికారులను సంప్రదించి చికిత్స అందిస్తే అవి మరణించే ప్రమాదం తగ్గుతుంది. ఎక్కువగా చలి వేయకుండా పాకలు, మందల చుట్టూ తగిన ఏర్పాట్లు చేసుకోవాలి.